## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, సెప్టెంబర్ 29 : హనుమకొండ టౌన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల వల్ల న్యూ శాయంపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు మోక్ష విలాస్ ఏరియాలో, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు బాసిత్‌నగర్ ఎస్టీ హాస్టల్ ఏరియాలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## దేశ సంపదను బీజేపీ కొల్లగొడుతోంది

ఐనవోలు, సెప్టెంబర్ 29 : దేశ, రాష్ట్ర సంపదను బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొల్లగొట్టి పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నాయని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి మండిపడ్డారు. వెంటాపురంలో జరిగిన సీపీఎం గ్రామ మహాసభకు మండల ప్రధాన కార్యదర్శి కాటబోయిన లింగయ్యతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఇప్పటి వరకు 60 శాతం మంది రైతులకే రుణమాఫీ చేసిందన్నారు. మిగిలిన 40 శాతం మంది రైతులకు రుణమాఫీ ఎప్పుడు చేస్తుందో స్పష్టత ఇవ్వకుండా కుంటి సాకులు చెబుతున్నదని విమర్శించారు. అనంతరం వెంకటాపురం నూతన కార్యదర్శులుగా దీకొండ ఉప్పలయ్య, మాదాసి పోచమ్మ, సహాయ కార్యదర్శిగా నారాయణరెడ్డి, సరోజనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదాసి యాకూబ్, దర్శనాల సంపత్, నారాయణరెడ్డి, బొమ్మకంటి యాకయ్య, కవిత పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని ఫిర్యాదు

హసన్‌పర్తి, సెప్టెంబర్ 29 : కబ్జాదారుల నుంచి కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం నారాయణనగర్ కాలనీ వాసులు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణనగర్ కాలనీలో 185వ సర్వే నంబర్‌లోని 30 ఫీట్ల రహదారిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మూసివేసి దారికి అడ్డంగా ఖనీలు నాటి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు పోతరాజు రాజేందర్, పోతరాజు లక్ష్మీనారాయణ, తిరుపతి, రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా 185,186 సర్వే నంబర్‌కు సంబంధించిన పట్టాదారులు తమకు విక్రయించారని తెలిపారు. ఎంతో కాలంగా కాలనీలో నిర్మించుకొని ప్రభుత్వానికి పన్నులు కూడా చెల్లిస్తున్నట్లు చెప్పారు. గతంలోనూ ఈ కాలనీలో భూ వివాదాలకు పాల్పడుతున్న కొంతమంది వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసులు నమోదు చేసినట్లు బాధితుడు రాజేందర్ తెలిపారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కాలనీలో రహదారికి అడ్డంగా ఖనీలు పాతి రాకపోకలకు అటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

## గుండెపోటుపై 'ఏకశిల' అవగాహన



పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట గుండెపోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేస్తూ అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 29 : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ఏకశిలా హాస్పిటల్ ఆధ్వర్యంలో సీపీఆర్ విధానంపై పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట అవగాహన కల్పించారు. గుండెపోటుకు కారణమయ్యే ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్ తీసుకోవద్దని వివరించారు. కార్డియాక్ అరెస్టయిన వ్యక్తికి 12 సార్లు సీపీఆర్ చేసి మళ్లీ గుండె కొట్టుకునేలా చేసే విధానాన్ని లైవ్‌లో వివరించారు. ఇలాంటి పేషెంట్లు ఎంతో మందికి తిరిగి ప్రాణం పోశామని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, ఇంటెన్సివ్ కేర్ హెచ్‌వోడీ ఆసిఫ్ ఇక్బాల్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు సంతోష్ మదాని, అనిల్, క్లినికల్ కార్డియాలజిస్ట్ లావణ్య, డైటీషియన్ అనూష, డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

# 'చలివాగు'ను కాంట్రాక్టర్‌కు ఇస్తే మందు తాగి చస్తాం

### రోడ్డెక్కిన మత్స్యసొసైటీ డైరెక్టర్, కార్మికులు


మాట్లాడుతున్న సొసైటీ డైరెక్టర్, కార్మికులు

శాయంపేట, సెప్టెంబర్ 29 : వేలాది మత్స్యకార్మికులకు అన్నంపెడుతున్న చలివాగు ప్రాజెక్టును కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు చైర్మన్ గండి రాజమౌళి కుట్రలు చేస్తున్నారని సొసైటీ డైరెక్టర్ పల్లెబోయిన భాస్కర్, కార్మికులు ఆరోపించారు. శాయంపేటలో మత్స్యకార్మికులంతా ఆదివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని పెద్దకోడెపాక చలివాగు ప్రాజెక్టు చెరువులో 13 గ్రామాల మత్స్యకార్మికులు చేపలు పట్టుకుంటూ జీవనం గడుపుతున్నామన్నారు. ఈ సీజన్‌లో చేపలు పట్టేందుకు డబ్బులు చెల్లించాలమన్నారు. కానీ సొసైటీ చైర్మన్ చలివాగు ప్రాజెక్టును కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాట వినకుంటే సభ్యత్వాలు రద్దు చేస్తానని బెదిరిస్తున్నాడని, నూతన సభ్యత్వాలు ఇప్పిస్తామంటూ పెద్ద మనుషులను పిలిపించుకుని ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చుకుంటూ అగ్రిమెంట్‌పై సంతకాలు తీసుకుంటున్నాడన్నారు. చేపలు పట్టరాని డైరెక్టర్లు చైర్మన్‌కు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. పది సంవత్సరాల క్రితమే కాంట్రాక్టర్ సిస్టమ్ రద్దయిందని తెలిపారు. చలివాగును కాంట్రాక్టర్‌కు ఇస్తే తమ కుటుంబాలు రోడ్డుపాలవుతాయని తమకు చావే దిక్కవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్మికులు భాస్కర్, కరుణాకర్, పల్లవి రాజు, అల్లం కుమారస్వామి, కుక్కల రవీందర్, దశరథం, రాజు, పిట్టల నరేశ్ పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు

## హోరాహోరీగా అండర్-19 క్రికెట్ పోటీలు

### మహబూబ్‌నగర్, వరంగల్ జట్ల ముందంజ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 29 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరుగుతున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పూల్-ఏ విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు నాకౌట్ పోటీలకు చేరింది. సోమవారం కోమటిపల్లి గ్రౌండ్‌లో వరంగల్, నల్లగొండ జట్ల మధ్య గెలిచిన జట్టు పూల్-ఏ నుంచి నాకౌట్‌కు క్వాలిఫై అవుతుందని, మొగిలిచర్ల గ్రౌండ్‌లో మహబూబ్‌నగర్ జట్టు మెదక్‌తో తలపడతుందని హెచ్‌సీఏ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బస్రాజు ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఖాజా, కార్యవర్గ సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, జిల్లా బాధ్యులు బండారి ప్రభాకర్, రామకృష్ణ, గ్రౌండ్ ఇన్‌ఛార్జి అభినవ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## 30లీటర్ల గుడుంబా పట్టివేత


గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

శాయంపేట, సెప్టెంబర్ 29 : అక్రమంగా తరలిస్తున్న 30లీటర్ల గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ ఆదివారం తెలిపారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా, గుడుంబా రవాణా చేస్తున్న బాబు శివ తిరుపతిని పట్టుకుని అతడి వద్ద 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. రూట్ వాచ్‌లో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్స్ అఖిల్, దిలీప్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై ఎమ్మెల్యే నాగరాజు వైఖరి తెలపాలి

ఐనవోలు, సెప్టెంబర్ 29 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమా? వ్యతిరేకమా? స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ వరంగల్ జిల్లా బాధ్యుడు బిర్రు మహేందర్ మాదిగ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో చింత అశోక్, బరిగెల వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్త సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బొక్కల నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోవజకవర్గంలో మాదిగలు తనకు ఓటు వేయాలేదని మాదిగలపై మాల ఉద్యోగుల సంఘం సమావేశంలో ఎమ్మెల్యే చులకనగా మాట్లాడడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రూ.2.70 లక్షల జీతాన్ని ఇచ్చినట్లు చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని మతాలు సమానమే, అన్ని వర్గాలను సమానంగా చూస్తానని ప్రమాణం చేసి ఇప్పుడు ఒక్క కులానికే వత్తాసు పలుకుతున్న నాగరాజు తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేశ్, చంద్రమౌళి, స్వామి, చేరాలు, భాస్కర్, బాబు, ఐలయ్య, ప్రవీణ్, సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహిళా అభివృద్ధి పథకం ప్రోగ్రాం మేనేజర్ లత

## 'వితంతువులకు అండగా జనవికాస'

కాజీపేట, సెప్టెంబర్ 29 : చిన్నతనంలోనే భర్తలను కోల్పోయి వివక్షతకు గురవుతున్న వితంతువులకు జన వికాస ఎల్లవేళలా అండగా ఉంటుందని అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, మహిళా అభివృద్ధి పథకం ప్రోగ్రాం మేనేజర్ లత అన్నారు. ఫాతిమానగర్‌లోని బాల వికాస కేంద్రంలో ఆదివారం వితంతువులు, పిల్లలకు జన వికాస ఆధ్వర్యంలో చేయూత కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ భారం మోయలేక ఇబ్బందులు పడుతున్న 80 మంది వితంతువులు, 184 మంది పిల్లలకు దాతల సహాయంతో దాదాపు రూ.17 లక్షల ఆర్థికసాయం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామన్నారు. జ్యోతి, సుజాత, అమూల్య పాల్గొన్నారు.


ట్రాఫిక్ పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలు అందిస్తున్న ఏసీపీ సత్యనారాయణ

## బాడీ వార్న్ కెమెరాలు వచ్చేశాయ్..

సుబేదారి, సెప్టెంబర్ 29 : డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో మందుబాబులను కట్టడి చేసేందుకు వరంగల్ ట్రాఫిక్ విభాగంలోకి బాడీ వార్న్ కెమెరాలు వచ్చాయని, ఇకపై మందుబాబులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రైసిటీ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో పాటు శాంతి భద్రతల పర్యవేక్షణ విధులు నిర్వర్తించే సమయంలో ప్రజల నుంచి ఎదురయ్యే సమస్యలు, దాడులను నియంత్రించేందుకు బాడీ వార్న్ కెమెరాలను ట్రాఫిక్ అధికారులకు అందజేశామన్నారు. కమిషనరేట్ పరిధిలోని మూడు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు మూడు చొప్పున వీటిని అందించినట్లు తెలిపారు. ఇకపై నగరంలో ట్రాఫిక్ పోలీసులు బాడీ వార్న్ కెమెరాలను ధరించి తనిఖీలు చేస్తారన్నారు. ఆ సమయంలో ఎవరైనా వాహనదారుడు పోలీసులపై దాడులకు పాల్పడినా, దూషించినా, విధులను ఆటంకం కల్గించినా కెమెరాలు జరిగిన వాస్తవాలను చిత్రీకరిస్తాయన్నారు. కార్యక్రమములో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, షుకూర్, నాగబాబు పాల్గొన్నారు.


రెజ్లింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న దస్రూనాయక్

## ఉత్సాహంగా జిల్లా రెజ్లింగ్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 29 : జిల్లా పాఠశాలల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం బాలికల అండర్ -14, 17 విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దుగ్గొండి, నల్లబెల్లి, హనుమకొండ, ములుగు, మహబూబాబాద్, జగ్గన్నపేట, చింతలపల్లి, సంగెం, ముండ్రాయి, మల్లంపల్లి గ్రామాల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడలో జరిగే రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు హనుమకొండ జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి దస్రూనాయక్ తెలిపారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రెజ్లింగ్ కోచ్‌లు రాజు, మహేశ్, దేవేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు రవీందర్, జ్యోతి, ముఖర్జీ, లావణ్య, సుజాత పాల్గొన్నారు.

## భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు

దామెర, సెప్టెంబర్ 29 : మండలంలోని ముస్త్యాలపల్లిలో భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన చిలివేరు భిక్షపతికి రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ నెల 28వ తేదీన ఇదే గ్రామానికి చెందిన బండారి సుజాత, కూతురు బండారి అఖిల, సుజాత తమ్ముడు కుమార్ భిక్షపతికి చెందిన రెండెకరాల భూమిలోకి అక్రమంగా ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్లి చదును చేశారు. భిక్షపతి ఫిర్యాదు మేరకు సుజాత, అఖిల, కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# రాబడి

*మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయంలోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్టు తేలింది.*

## ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

**ప్రస్తుతం** ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్‌ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్స్‌నుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.



**ఎంచుకోండిలా..**

**యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో** సబ్‌స్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

**జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో** సబ్‌స్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

**ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో** సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

**యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో** సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

**జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్‌లో** సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

### ఇవి గుర్తుంచుకోండి..

**యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.**

అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.

**వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.**

నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.

**పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.**

కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.

**ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పుడే అన్ని చూసుకొని నిర్ణయం తీసుకోవాలి.**

# చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి



### మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?

### త్వరపడండి.. మరో 6 నెలలే సమయం

**మీరు** ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్టైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

**ఏమిటి ఈ పథకం?**

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

**ప్రధాన ఫీచర్లు..**

**వార్షిక వడ్డీరేటు:** 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

**అర్హత:** మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

**కాలపరిమితి:** రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

**పెట్టుబడి:** కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

**ఏమిటి దీని ప్రత్యేకత?**

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

**ఎలా పెట్టుబడి పెట్టాలి?**

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ధరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జీరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

| డిపాజిట్ | వడ్డీ ఆదాయం | చివరకు వచ్చే మొత్తం |
|---|---|---|
| ₹ 1,000 | ₹ 160 | ₹ 1,160 |
| ₹ 2,000 | ₹ 320 | ₹ 2,320 |
| ₹ 3,000 | ₹ 481 | ₹ 3,481 |
| ₹ 5,000 | ₹ 801 | ₹ 5,801 |
| ₹ 10,000 | ₹ 1,602 | ₹ 11,602 |
| ₹ 20,000 | ₹ 3,204 | ₹ 23,204 |
| ₹ 30,000 | ₹ 4,807 | ₹ 34,807 |
| ₹ 50,000 | ₹ 8,011 | ₹ 58,011 |
| ₹ 1,00,000 | ₹ 16,022 | ₹ 1,16,022 |
| ₹ 1,50,000 | ₹ 24,033 | ₹ 1,74,033 |
| ₹ 2,00,000 | ₹ 32,044 | ₹ 2,32,044 |

# చదువు కోసం మదుపు..

**నేడు** పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

**ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు**

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టే పెట్టుబడులు ఈక్విటీల్లోకి వెళ్తాయి. చిన్న మదుపరులకూ ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఈ పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయన్నది గుర్తుంచుకోవాలి.

**ఎడ్యుకేషనల్ స్కీములు**

వివిధ మ్యూచువల్ ఫండ్స్.. పిల్లల విద్యకయ్యే ఖర్చుల కోసం రక రకాల పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈక్విటీ, డెట్ లేదా బంగారంపై పెట్టుబడులు పెడుతూ ఆకర్షణీయ రాబడులను పొందవచ్చు.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లతో పోల్చితే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) తక్కువ రాబడులనే అందిస్తాయి. కానీ ఇవి సురక్షితమైనవి, నిర్దేశిత రాబడులనూ అందుకోవచ్చు.

**విద్యా రుణాలు**



ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు విద్యా రుణాలనూ తీసుకోవచ్చు. ఇతర రుణాలతో పోల్చితే వీటికి కొన్ని వెసులుబాట్లుంటాయి. మారటోరియం పీరియడ్ ఉంటుంది. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రుణ చెల్లింపులను ప్రారంభించుకోవచ్చు. పాత పన్ను విధానం కింద ఐటీ చట్టంలోని సెక్షన్ 80ఈతో పన్ను మినహాయింపూ లభిస్తుంది.

### మార్కెట్ పల్స్




# ఆటుపోట్లకు ఆస్కారం!

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో రికార్డ్ రన్ కొనసాగుతున్నది. మునుపెన్నడూలేని గరిష్ఠాల్లో సూచీలు కదలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడుల దిశగానే పోతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో ఎక్కువ రోజులు ఈక్విటీ మార్కెట్లు లాభాల్లోనే నడిచాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు లేదా 1.21 శాతం పెరిగి 85,571.85 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 388 పాయింట్లు లేదా 1.50 శాతం పుంజుకొని 26,178.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మార్కెట్లు నష్టపోవడం ఇందుకు సంకేతంగా తీసుకోవచ్చని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉండటం వల్ల సెల్లింగ్ ప్రెషర్ ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26,400-26,600 మధ్యకు వెళ్లవచ్చు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.